మినీ కథ

# సస్పెన్స్

కాళీపట్నం చంద్రశేఖర్

సుబ్బారావుదొక రకమైన వ్యక్తిత్వం. ఈ రకం వ్యక్తులుండరని నేను అనడం లేదు. కానీ చాలా అరుదు అని మాత్రం చెప్పగలను. మనిషి ఎప్పుడూ చాలా హడావిడిగా వుంటాడు. బెదురుగా అటూ ఇటూ తిరిగే కళ్ళు. ఇదీ చాలా మందిలో మామూలే. కానీ ఆ ఒక్క గుణం మాత్రం చాలా అరుదు. అదే...... అణుమాత్రం సస్పెన్స్ కూడా భరించలేక పోవడం.

"ఒకసారేమయ్యిందో తెలుసా?......" అని వాడితో మాటలు మొదలు పెట్టామనుకోండి. ఆ విషయాన్ని పూర్తిగా చెప్పేంతవరకూ మనని ఆగనివ్వడు. ఈ లోపల మనకేదైనాపని కావల్సొచ్చినా చేసి పెట్టేస్తాడు. ఈ గుణాన్ని... కాదు ఈ బలహీనతని నా ఎదురుగుండా చాలా మంది వినియోగించుకోవడం చూసేను.

నాకు దగ్గరవాడని అయితేనేం, వాడి మీద సానుభూతితో నైతేనేం ఈ బలహీనత నుండి వాడిని దూరం చేయాలని నిర్ణయించుకొని, చాలాసార్లు ఏవేవో ప్రయత్నాలు చేసి విఫలమయ్యాను.

కానీ వారం రోజుల నుంచీ చూస్తున్నాను. ఎందుకోవాడు చాలాముభావంగావుంటున్నాడు.

నా ప్రక్కసీటు అప్పారావు, పాత ట్రిక్కు ఉపయోగించి పాతిక అప్పు సంపాదించాలని వెళ్లి విఫలమై రావడం నాలో ఆశ్చర్యాన్ని కల్గించింది. అప్పారావు సంగతి సరేసరి.

లంచ్‌లో ఎదురుగా కూర్చున్నపుడు అడిగాను "ఏమిటో ఈ మధ్య చాలా ముభావంగా వుంటున్నావు" అని.

"తరువాత చెప్తాను" అంటూ నిర్లిప్తమైన నవ్వొకటి వెలిగించి, పనుందంటూ వెళ్ళిపోయాడు.

బొంబాయిలోని 'గేట్‌వే'ని ఎత్తుకొచ్చి విశాఖపట్నంలో పెట్టినట్లుగా వాడి బుర్రలోని సస్పెన్స్ జబ్బు నాలో ప్రవేశిందేమిటా అని ఆలోచిస్తున్నప్పటికీ అందడంలేదు ఈ సస్పెన్స్.

* * *

సుబ్బారావు!

నీలాంటి వాళ్ల బలహీనతలతో ఆడుకోవడం నాకు చాలా సరదా నిన్నటి వరకూ! ఈ రోజు, రేపు వున్నా తీర్చుకొనే అవకాశం లేదు నాకు. అఫ్‌కోర్స్. ఈ నాకే కాదు, మనిషన్న వాడికి. లేకపోతే మనుగడ సాగించలేడేమో? మొన్న నీ సస్పెన్స్ పిచ్చి నుపయోగించుకొని తీసుకున్న 'అప్పు'ని వినియోగం చేయటాన్కి సినిమాకి బయలుదేరి దారిలో లారీ ఘాతానికి గురై కాళ్లు పోగొట్టుకొని ప్రస్తుతం హాస్పిటల్ నుండి ఈ ఉత్తరాన్ని వ్రాయిస్తున్నాను.

నీకేదో సస్పెన్స్ 'కథ' చెప్పి, మరుక్షణంలో నా జీవితంలో జరగబోయే విఘాతాన్ని ఊహించుకోలేక పోయాను. కాబట్టి అన్నింటికంటే సస్పెన్స్‌తో కూడుకున్నది 'జీవితం' సుమా!

దానిలోని సస్పెన్స్ తెలుసుకోవడాన్కి మాత్రం ప్రయత్నించకు. చంద్రమండలం మీద తీసిన ఫోటోలలోలా అఘాతాలు కన్పిస్తాయి. అంతే! నీలాంటి వాళ్ళకు చేసిన అన్యాయానికి నాకు భగవంతుడు విధించిన శిక్ష-నా జీవితాన్ని బలి తీసుకోవడం. మరొక్కసారి ఈ బలహీనతకి లోనుకావనుకొంటూ

-సుబ్రహ్మణ్యం

ఆరోజు సాయంత్రం సుబ్బారావు అందించిన ఈ లెటర్ చదివిన్పటికీ నమ్మశక్యం కావడం కాలేదు ఎందుకో. "ఈ మాత్రమే వీడిలోని సస్పెన్స్ పిచ్చి పోగొట్టిందంటే... ఏదో వుండి తీరాలి!" అన్న భావన నా మనస్సుని కుమ్మరి పురుగులా దొలిచేస్తున్నది.

ఆ తర్వాత అర్థం అయింది. అర్థం లేనిదే సస్పెన్స్ అని.

